

# పశ్చాత్తాపం

పూరిజాల సుధాకర్

ఇంటర్వ్యూకి వచ్చిన అందరిలోసుందరరామయ్యే కాస్తపెద్దవాడు. అప్పుడే కారు దిగిన విశ్వాన్ని చూసి ఆశ్చర్యపోయారాయన.

సుందరరామయ్యని చూసి విశ్వం మరింత చిన్నబోయాడు.

ఇంటర్వ్యూ ముగిసింది.

అందరూ వెళ్లిపోయారు.

సుందరరామయ్య వెళుతూంటే మాష్టారూ అన్న పిలుపు వినబడింది.

విశ్వాన్ని చూసిన వెంటనే తల దించుకున్నారాయన.

నన్ను క్షమించి కారెక్కండి మాష్టారూ అన్నాడు విశ్వం.

సుందరరామయ్య కారు ఎక్కారు.

స్పీడ్‌గా పోతోంది కారు. ఇద్దరూ మాట్లాడలేదు.

సుందరరామయ్యకి గత ఆలోచనలు చుట్టుముట్టాయి.

"ఏమీరాయడం లేదేం గంటన్నర అయ్యింది"

"నాకా అవసరం లేదు— నాకేం రాదు"

"అయితే అడిషినల్స్ ఎందుకు?"

"ఫీజు కట్టానుగా, కనీసం అవయినా వాడుకోవద్దా?"

"టైమ్ వేస్టు చేస్తున్నావ్"

"టైమ్ గురించి ఆలోచించాల్సింది కేవలం చదివిన వాళ్లు."

"అయితే పేపర్స్ ఇచ్చేసి వెళ్లిపోవచ్చుగదా"

"ఓకే ష్యూర్"

* *** *

"ఈరోజు ఏమన్నా రాస్తారా?"

"లేదు మాష్టారూ'

"మరేం చేస్తావ్?"

"కాసేపు కూచుని వెళ్లిపోతాను."

"క్వశ్చన్స్ ఒక్కటీ రాదా?"

"రాదు మాష్టారూ"

"అయితే అరగంట తర్వాత వెళ్లిపో."

"అలాగే"

* *** *

"ఈరోజు ఆఖరి పరీక్ష— ఈరోజూ!ఏమీ రాయవా?"

"లేదు సార్. నాకు పరీక్ష మొదటి రోజూ ఒకటే ఆఖరి రోజూ ఒకటే"

"నువ్వసలు ఫైనల్ ఇయర్ వరకూ రావడమే ఆశ్చర్యం. ఈ ఫైనల్ ఇయర్‌లో భవిష్యత్ నాశనం చేసుకున్నావ్ మళ్లీ కడతావా"

"నో సర్— నేను మళ్లీ పరీక్షకు కట్టను"

"మరి"

"మీరు వాచింగ్ చూసుకోండి సార్. నేనేం పరీక్ష రాస్తున్నానా? మాల్‌ప్రాక్టీస్ చేస్తున్నానా?"

"లేదు. అదే నాకు ఆశ్చర్యంగావుంది. నీ నెంబర్ నోట్ చేసుకుంటాను."

"చేసుకోండి సార్— నాకేం అభ్యంతరం లేదు."

* *** *

మాష్టారూ నాకు సెకండ్ క్లాస్ వచ్చింది నెంబర్ చూడండి.

"ఆ!"

"ఏదో మోసం జరిగింది. యూనివర్శిటీకి నోట్ రాస్తాను"

"మీ ఇష్టం సార్, వస్తాను"

"దిగండి మాష్టారూ" ఆలోచనలలోంచి తేరుకున్నారాయన.

ఆధునికమైన మేడ

లోపలికి వెళ్లారు.

భార్యను పరిచయం చేశాడు విశ్వం.

శ్రీకృష్ణుని గృహంలో కుచేలుడులా తను.

"మాష్టారూ! నిజాయితీకి మారుపేరు మీరు. నా వలన మీ ఉద్యోగానికి రిజైన్ చేశారు. యూనివర్శిటీలో మా వాళ్లు కొంతమంది మంచి మంచి జాబ్స్‌లో ఉన్నారు. వాళ్లు నేను పరీక్షలు రాయక పోయినా నా నెంబర్ పేపర్లో పడేట్లు చేశారు. తర్వాత యూనివర్శిటీ సీటు ఇప్పించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మా అంకుల్ ఆయనే ఎమ్‌ఏ రేంకు వచ్చేట్లు చూసుకున్నారు. కానీ కేవలం నా వల్ల మీ కుటుంబం చితికిపోయింది. ఆ బాధ నన్ను పీడిస్తోంది. మీ అప్లికేషన్ చూసి నేను ఎంతో ఆనందించాను. మీరు దయచేసి మీ కుటుంబ పరిస్థితిని దృష్టిలో వుంచుకునైనా ఈ పోస్టులో చేరండి. అసలు మీ లాంటి ఉత్తములు, నిజాయితీపరులు మా సంస్థకు అవసరం" క్లియర్‌గా అన్నాడు విశ్వం.

ఉద్యోగానికి రిజైన్ చేసినప్పటి నుంచీ అనుభవించిన దారిద్ర్యం గుర్తొచ్చింది సుందరరామయ్యకి. అయినా అవినీతితో అందలం ఎక్కిన శిష్యుడు ఉద్యోగం ఇప్పిస్తే చేయాలా? ఆలోచించసాగారాయన.

"ఇంకా ఆలోచించకండి. ఓ మాట చెప్పనా ఇంటర్వ్యూలో కూడా మీరు బాగా చేశారు."

ఆ మాట అతనికి బలాన్నిచ్చింది.

"మీరు నిజాయితీగానే సెలెక్టు అయ్యారు."

సుందరరామయ్య వదనం ఆనందంతో వెలిగింది.

అతని వదనంలోని ఆనందం చూసిన విశ్వం తృప్తిపడ్డాడు.